
ప్రజాశక్తి

ఆదివారం 16 జూన్ 2024

5

పార్వతీపురం మన్యం



పార్వతీపురం - రాజమండ్రి అదనపు బస్సు సర్వీసులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పార్వతీపురం నుంచి రాజమండ్రికి వెళ్లే ప్రయాణికుల కోసం కొత్తగా రెండు అదనపు బస్సు సర్వీసులు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆర్టీసీ డిఎం కనకదుర్గ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు పార్వతీపురం నుంచి విజయవాడకు మూడు అల్ట్రా డీలక్స్ బస్సులను నడుపుతున్నామని తెలిపారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజు ఉదయం 8 గంటలకు, సాయంత్రం 4 గంటలకు బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు.

అసంపూర్తి భవనాలు... అరకొర సౌకర్యాలు

- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- డ్రాపౌట్ అవుతున్న విద్యార్థులు



రామస్వామినాయుడుపేటలో ఉపాధ్యాయుడు లేక ఏడాదిగా మూతపడ్డ పాఠశాల



గంగన్నదొరవలసలో పక్కా భవనం లేక వరండా చదువుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఈ ఏడాదీ విద్యార్థులకు అసంపూర్తి భవన నిర్మాణాలు, అరకొర సౌకర్యాలు అవస్థలు తప్పడంలేదు. ఈ గత ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పుకునే నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల నిర్మాణం నిమిత్తం మండలంలో చాలా వరకు పాఠశాలలకు నిర్మాణ భవనాలు పూర్తికాకుండానే పునాదుల దగ్గరే ఆగిపోయాయి. గ్రామస్తులు ఎన్నోసార్లు సంబంధిత అధికారులకు విన్నవించుకున్నా కనీసం పట్టించుకునే నాథుడే లేరు. దీంతో పలువురు చిన్నారులు మధ్యలో చదువును ఆపేసి పొలం పనులకు పరిమితమవుతున్నారు.

మండలంలోని మరుపల్లి పంచాయతీ గంగన్నదొరవలసలో సుమారు 45 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలకు చుట్టుపక్కల ఐదు గ్రామాలకు చెందిన విద్యార్థులు కాలినడకన వచ్చి ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారు. అయితే వీరు చదువుకొనేందుకు సరైన భవనం లేదు. దీంతో గ్రామంలోని మూడిళ్ల వద్ద గడపల్లో పిల్లలకు ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారు. ఈ విషయమై గ్రామస్తులు అధికారులు, పాలకుల దృష్టికి పలుమార్లు విన్నవించుకున్నా ఫలితం శూన్యం. అలాగే మండలంలో పెద్దాపురం పంచాయతీ రామస్వామి నాయుడు వలసలో ఏకోపాధ్యాయ పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయుడు మరణించారు. ఆయన మరణించి ఏడాదైనా వేరే ఉపాధ్యాయుడ్ని నియమించ లేదు. దీంతో ఇక్కడ చదువుతున్న సుమారు 14 మంది పిల్లలు విద్యకు దూరమైపోయారు. తమ గ్రామానికి ఉపాధ్యాయుడ్ని నియమించి, తమ పిల్లలకు విద్యను అంధించాలని స్థానిక విద్యాశాఖాధికారులకు పలుమార్లు గ్రామస్తులు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల మూతపడడంతో తమ పిల్లలను చదువుమానిపించి పనులకు పంపాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పాలకులు ఒకవైపున బడిబయట పిల్లలను బడిలో చేర్పించాలని, పిల్లలను పనులకు పంపకుండా పాఠశాలలకు పంపాలని ప్రచారం చేస్తున్నారే తప్ప పాఠశాలల్లో ఉపాధ్యాయులు, వసతి సౌకర్యాలపై దృష్టి సారించడంలేదు. దీంతో అనేక మంది విద్యార్థులు డ్రాపౌట్లుగా మారుతున్నారు. ఇలాంటి పరిస్థితులు మండలంలో కేవలం ఈ రెండు గ్రామాల్లోనే కాకుండా అనేక గ్రామాల్లో ఉంది. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రత్యేకమైన శ్రద్ధ చూపి భవనాల్లేని పాఠశాలలకు తక్షణమే భవనాలు మంజూరు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించి తమ పిల్లలకు మెరుగైన విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అభివృద్ధే ప్రధాన అజెండా

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల నియమిస్తాం
గిరిజన సంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్ర అభివృద్ధే ప్రధాన అజెండాగా తమ ప్రభుత్వం పని చేస్తుందని గిరిజన సంక్షేమ, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చెప్పారు. శనివారం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో సైకో పాలన పోయిందని, సైకిల్ పాలన మొదలైందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి మేనిఫెస్టోలో ప్రకటించిన హామీల అమలుపై సిఎం చంద్రబాబునాయుడు సంతకాలు చేసినట్లు చెప్పారు. నిరుద్యోగులకు హామీ ఇచ్చిన విధంగా సుమారు 17వేల పోస్టులతో మెగా డిఎస్సీపై తొలి సంతకం చేశారని చెప్పారు. వృద్ధులకు రూ.4వేల పింఛను అమలుపై కూడా సంతకం చేసినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని చెప్పారు. మొత్తం 175 స్థానాలకు కూటమి 164 స్థానాల్లో విజయం సాధించడం టిడిపి స్థాపించిన తొలినాళ్లలో కూడా జరగలేదని చెప్పారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉత్తమ పాలన అందిస్తామని చెప్పారు. జులైలో పింఛనుదారులకు మొత్తం రూ.7వేలు అందజేయనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ప్రతి టిడిపి కార్యకర్త లబ్ధిదారులకు దగ్గరుండి అందజేయాలన్నారు. ఏజెన్సీలో గిరిజనులకు డోలీమోతలు లేకుండా చూస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో గిరిజన గర్భిణులు మార్గమధ్యంలోనే ప్రసవించిన సందర్భాలు చూశామని చెప్పారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందజేసేలా చూస్తానన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఎఎన్ఎంల నియామకం చేపడతామని చెప్పారు. గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీటి సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొటియా గ్రామాల వివాదం కోర్టులో ఉందన్నారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్లనే ఒడిశా అధికారులు, ప్రజాప్రతినిధులు కొటియా గ్రామాల్లోకి చొరబడి దౌర్జన్యం చేశారని చెప్పారు. భూములు, ఆస్తులు తాకట్టు పెట్టుకోవడమే ధ్యేయంగా పని చేసిన గత ముఖ్యమంత్రి జగన్ ఒడిశా సిఎంతో కలిసిన తర్వాతే ఒడిశా నాయకుల ఆగడాలు పెరిగిపోయాయని చెప్పారు. సాక్షాత్తూ ఒడిశా కేంద్ర మంత్రే ఆంధ్రా గో బ్యాక్ వ్యాఖ్యానించడం అనుమానాలకు తావిస్తోందని చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో వుంటానని చెప్పారు. ముఖ్యంగా మహిళలు, గిరిజనులు ఎప్పుడైనా తన వద్దకు వచ్చి సమస్యలు చెప్పుకోవచ్చునని చెప్పారు. తనకు ఇష్టమైన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పదవి దక్కుతుందని ఆశించానని, అయితే మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి పదవిని ఊహించలేదని అన్నారు. రాష్ట్రంలోని నిరుపేద మహిళలు, పిల్లలకు పౌష్టికాహారం అందించడానికి కృషి చేస్తానని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికే తాను మొదటి ప్రాధాన్యత ఇస్తానని సంధ్యారాణి చెప్పారు. ఈ సమావేశంలో సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, జి.వేణుగోపాలరావు, పిన్నింటి ప్రసాద్ బాబు, రాష్ట్ర కార్యదర్శి ముఖీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

మంత్రి సంధ్యారాణికి అభినందనలు

సాలూరు రూరల్ : రాష్ట్ర గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని సాలూరులోని తన నివాసంలో జిల్లా వ్యవసాయశాఖఅధికారి కె.రాబర్ట్ పాల్, సాలూరు ఎడిఎ మధుసూదనరావు, ఎఒ అనూరాధ పండా, వ్యవసాయ శాఖ సిబ్బంది అభినందనలు తెలిపారు.



ఇఎంఎస్ నంబూద్రిపాద్‌కు నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు, కార్యకర్తలు

కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత ఇఎంఎస్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

భారతకమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత ఇఎంఎస్ నంబూద్రిపాద్ అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యమ్మల మన్మధరావు, జిల్లా కమిటీ సభ్యులు జి.వెంకటరమణ అన్నారు. నంబూద్రిపాద్ జయంతి సందర్భంగా శనివారం స్థానిక సుందరయ్య భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ లర్పిస్తున్న సిపిఎం నాయకులు ఈ సందర్భంగా మాట్లాడుతూ నంబూద్రిపాద్ సిపిఎం వ్యవస్థాపక నాయకుల్లో ఒకరని, దాదాపు ఏడు దశాబ్దాల ప్రజా జీవితంలో దేశ ప్రగతిశీల, శ్రామిక ఉద్యమంపై ఆయన చెరగని ముద్రవేశారని అన్నారు. యువకుడిగా ఉన్నప్పుడే ఆయన కులంపై సాంఘిక సంస్కరణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారన్నారు. 1931లో కాలేజీని వదిలి స్వాతంత్ర్య పోరాటంలో చేరారని, సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారని, అప్పటి నుంచి ఆయన దేశ స్వాతంత్ర్యం కోసం సాగిన కాంగ్రెస్ ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించారని అన్నారు. కేరళలో ఒక శక్తివంతమైన కమ్యూనిస్ట్ ఉద్యమ అభివృద్ధికి పునాదులు వేశారని, ఇందుకు ఆయన సామ్రాజ్యవాద, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలకు ప్రాతినిధ్యం వహించారన్నారు. కమ్యూనిస్టు పార్టీని మరింత విస్తృత పర్చడానికి ఆయన తన వాటాగా వచ్చిన కుటుంబ ఆస్తిని పార్టీకి విరాళంగా ఇచ్చారన్నారు. భూస్వామి కుటుంబంలో పుట్టినా శ్రామిక వర్గ లక్ష్యాలకు అంకితమై శ్రామిక విప్లవ ఉద్యమంలో అగ్ర నాయకుడిగా ఎదిగారన్నారు. ఆయన నిరాడంబర జీవితం ఎందరికో స్ఫూర్తిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.సూరిబాబు, పి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మకం నిలబెట్టుకుంటేనే..

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



ఉమ్మడి విజయనగరం జిల్లాలో టిడిపి ఎమ్మెల్యేలంతా భారీ మెజార్టీలతో గెలిచారు. రాష్ట్ర రాజధానిలో జరిగిన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి, ఎన్‌డిఎ సమావేశానికి వెళ్లి వచ్చారు. ఇలా వచ్చారో లేదో ఓట్లేసి గెలిపించిన జనమే మురిసిపోతూ పుష్పగుచ్ఛాలు, సాలువాలతో సత్కరించేందుకు తండోపతండాలుగా తరలి వెళ్లారు. అన్ని నియోజక వర్గాల్లోనూ ఇటువంటి సందడి కనిపిస్తోంది. కానీ, ఈ హడావుడి ఏమీ కొత్తకాదు. తాము నమ్ముకున్న, ఎన్నుకున్న ప్రజాప్రతినిధులను గౌరవించడమంటే తమ ఆకాంక్షలను, ఆశలను తీరుస్తారనే నమ్మకం పెంచుకోవడమే. ఈ నమ్మకాన్ని ప్రస్తుత ఎమ్మెల్యేలు నిలబెట్టుకుంటారా? లేదా? అన్నదే కొద్దిరోజులుగా వినిపిస్తున్న పబ్లిక్ టాక్. ఇందుకు కారణం లేకపోలేదు. కారణాలు ఏవైనా గతంలో గెలిచిన ఎమ్మెల్యేల్లో ఎక్కువ మంది ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదు. ఎంతసేపూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలనే లెక్కల్లో చూపించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ఏమాత్రం చొరవ చూపలేదు సరికదా? నేల విడిచి సాము చేసినట్టు ఓట్లేసిన జనాన్ని వదిలేసే వ్యాపారులు, పెట్టుబడిదారులు, మధ్యవర్తులు లాభపడే విధంగా వ్యవహరించారు. బొబ్బిలిలో మూతపడిన శ్రీనివాస జ్యూట్‌మిల్లును తెరిపిస్తామంటూ హామీ ఇచ్చిన గత ఎమ్మెల్యే అదే జ్యూట్ మిల్లును రియల్ ఎస్టేటర్ల పరం చేశారు. తోటపల్లి నీరు రప్పించేందుకు బ్రాంచికెనాల్ ఏర్పాటు చేసి తీరుతామని చెప్పినప్పటికీ నెరవేర్చలేదు. కురుపాంలో పూర్ణపాడు - లాబేసు వంతెన నిర్మాణం పూర్తిచేస్తామని చెప్పిన పుష్పశ్రీవాణి అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదు. గజపతినగరం నియోజకవర్గంలో అప్పటి ఎమ్మెల్యే అప్పలనర్సయ్య మరో అడుగు ముందుకువేసి ప్రభుత్వ, ప్రైవేటు భూములు వశపర్చుకోవడం వంటి వాటికి యథేచ్ఛగా పాల్పడ్డారు. ఓట్లేసిన ప్రజలతోపాటు ఆయన గెలుపునకు కృషిచేసిన నాయకులను కూడా పట్టించుకోలేదు. కలిసి తమ సమస్యలు చెప్పుకునేందుకు కూడా సమయం ఇవ్వలేదు. పార్వతీపురం తదితర నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది.

మరో మాటలో చెప్పాలంటే జనాన్ని డబ్బులతో కొనుగోలు చేయవచ్చనే ధోరణిలోకి వెళ్లిపోయారు. ఇలా ఉమ్మడి విజయనగరం జిల్లాలో అన్ని చోట్లా అదే పరిస్థితి ఉండడం వల్ల వైసిపి ఎమ్మెల్యేలంతా ఓడిపోయారు. ప్రస్తుత ఎమ్మెల్యేలు ఆవిధంగా మారబోరనే ఆశ ప్రజల్లో ప్రస్తుతం ఉంది. ఇచ్చిన హామీలను కూడా నెరవేరుస్తారన్న ఆశలు ప్రగాఢంగా ఉన్నాయి. అదే నమ్మకంతో పనిచేసి ప్రజాసమస్యలపైనా, గ్రామాల అభివృద్ధిపైనా దృష్టిపెడితేనే తిరిగి మళ్లీ ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా కొనసాగే అవకాశం ఉంటుంది. తమ అభీష్టాలకు అనుగుణంగా, అభివృద్ధికి పాటుపడుతూ ముందుకు సాగాలని జనం చర్చించుకుంటున్నారు. ఆ నమ్మకాన్ని ఎమ్మెల్యేలు నిలబెట్టుకోవాలని కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు రమణ, అవినాష్ తదితరులు

జిఒ 3ను వెంటనే అమలు చేయాలి

- స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి
- సవర భాష వాలంటీర్లను రెన్యువల్ చేయాలి
- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మొట్టమొదట మెగా డీఎస్సీపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతకం చేయడం సంతోషమని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్, కోశాధికారి మండంగి రమణ అన్నారు. శనివారం స్థానిక రావాడ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇదే రావాడ సెంటర్ వద్ద చంద్రబాబునాయుడు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో 3ను అమల్లోకి తీసుకొచ్చి గిరిజనులకు న్యాయం చేస్తానని ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేసి స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గిరిజన ప్రాంతంలో ఉన్న ఉద్యోగాలన్నీ గిరిజనులకే ఇవ్వాలని అప్పుడే గిరిజన యువతకు న్యాయం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో 39 వేలు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలున్నాయని, వీటన్నింటినీ భర్తీ చేయాలని కోరారు. అనేక ఏళ్లుగా సవర భాషా వాలంటీర్లుగా పని చేస్తూ సేవలు అందిస్తున్న ఆ భాషా వాలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకొని వారికి న్యాయం చేయాలని కోరారు. మన్యం జిల్లాకు చెందిన గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, కురుపాం, పాలకొండ ఎమ్మెల్యేలు దృష్టి సారించి గిరిజన సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో గిరిజన సంఘం, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు మండంగి శ్రీనివాసరావు, సన్యాసి, కొల్లి గంగు నాయుడు, నాయకులు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శు కోలక అవినాష్, మండంగి లక్ష్మణరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. గత ప్రభుత్వం జీవో 3ను పునరుద్ధరించకుండా ఆదివాసీ నిరుద్యోగులకు అన్యాయం చేసిందన్నారు. ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారంలో జిఒ 3ను అమలు చేస్తానని హామీ ఇచ్చారని, ఆ హామీని అమలు చేసి ఏజెన్సీ ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. అలాగే ఐదేళ్లుగా ఐటిడిఎ పరిధిలో ఉన్న ఖాళీలను భర్తీచేయాలన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, జనరల్ డిఎస్సీతో పాటు ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.

ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. శనివారం ఆయన స్థానిక ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు ఏ మేరకు వైద్య సేవలు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని సమస్యల గురించి తెలుసుకున్నారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన భవనాన్ని పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రిలో ఎంతమంది వైద్యులు? సౌకర్యాలు ఎలా ఉన్నాయి అని సూపరింటెండెంట్ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. గిరిజనులకు వైద్య సేవలు సకాలంలో అందించాలన్నారు ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కారానికి అడుగులు వేస్తామని అన్నారు. రోగుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. జ్వరంతో బాధపడుతున్న టిడిపి నాయకులు సవర తోట మొఖ లింగం, రాజబాబును పరామర్శించారు.

పాఠశాల ప్రారంభం

అనంతరం పిఎంఆర్‌సి వద్ద నూతన పాఠశాల వివేకానంద విద్యా భారతి పాఠశాలను ఎమ్మెల్యే జయకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. విద్యార్థులకు వివేకానంద విద్యా భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ అందుబాటులో ఉండడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు చదువు కోసం దూరం వెళ్లాల్సిన అవసరం లేకుండా మన గ్రామంలోనే ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం టిటిడి వెంకటేశ్వర స్వామి ఆలయం లోనూ, బస్టాండ్ వద్ద ఉన్న కాశీ విశ్వేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తోటపల్లి రిజర్వాయర్ మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగ, సర్పంచ్ కళావతి, టిడిపి నాయకులు హెచ్.ప్రసాద్, వీరఘట్టం, సీతంపేట మండలాల జనసేన అధ్యక్షులు జానీ, విశ్వనాథం, మాజీ ఎంపిపి సవర మాలయ్య, గేదెల చిరంజీవులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసిన డిఎస్‌పి

పాలకొండ జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను పాలకొండ డిఎస్‌పి జీవీ కృష్ణారావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన్ను కలిసిన వారిలో సిఐ చంద్రమౌళి ఉన్నారు.



పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

ఎమ్మెల్యేకు ఆర్‌టిసి ఉద్యోగులు అభినందనలు

వీరఘట్టం: మండలంలోని ఎం.రాజపురంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ సెక్రెటరీ బాసురు కృష్ణమూర్తి, మన్యం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.దుర్గారావు అభినందించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, రవికుమార్, ఎం.ఆనంద్, ఎన్.నాగభూషణరావు, ఆర్‌ఆర్ కె రావు, సిహెచ్ ధనుంజయ నాయుడు , కృష్ణారావు, ఎస్ వెంకట్రావు ,బల్ల హరిబాబు, తదితరులు పాల్గొన్నారు .



శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

శ్రీశ్రీ రచనలు చైతన్య దీపికలు

ప్రజాశక్తి - సాలూరు

సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో శ్రీశ్రీ రచనలు ఎంతగానో దోహదపడ్డాయని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి అన్నారు. శ్రీశ్రీ 41వ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమాజంలో జరుగుతున్న దురాచారాలపై నిర్మోహమాటంగా అభిప్రాయాలను తన రచనల్లో వ్యక్తం చేసిన గొప్ప కవి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతి లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు శశికళ, గౌరీశ్వరి, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వైనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో భారీ వర్షం



గుమ్మలక్ష్మీపురంలో కురుస్తున్న భారీ వర్షం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో శనివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులు, భారీ ఈదురు గాలులు, వడగళ్ల వాన కురిసింది. పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. కురిసిన వర్షంతో వారం రోజులుగా వేడిక్కిన వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. ఈ వర్షం ఖరీఫ్ పనులు ప్రారంభానికి అనుకూలంగా ఉంటుందని రైతులు అంటున్నారు. మరో రెండు, మూడు వర్షాలు కురిస్తే దుక్కులు వేయడానికి వీలుంటుందని చెబుతున్నారు. గుమ్మలక్ష్మీపురంలోని శృంగవరపు వీధిలో ఉన్న ఆశ్రమ పాఠశాల అదనపు భవనంపై భారీ వృక్షం కూలింది. అయితే ఆ సమయంలో విద్యార్థులెవరూ పరిసర ప్రాంతాల్లో లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న ఒక ఇంటిపై చెట్లు కొమ్మలు విరిగిపడ్డాయి. పెద్ద శబ్దం రావడంతో ఇంట్లో ఉన్న వారంతా ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అలాగే ఎల్విన్ పేట, లేవిడి, లక్కగూడ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది.

భామిని: మండలంలోని భామిని, సింగిడి గ్రామాలలో శనివారం సాయంత్రం వీచిన గాలులకు ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న భామిని వేప చెట్టు, సింగిడిలో చింత చెట్టు కూలటంతో వాహన రాక పోకలకు అంతరాయం ఏర్పడింది. అనంతరం అధికారులు చెట్లను తొలిగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. గాలులు అనంతరం భామినిలో అరగంట పాటు వర్షం కురిసింది.

ఎమ్మెల్యేలకు అభినందనలు

ప్రజాశక్తి- కురుపాం, పార్వతీపురం టౌన్, వీరఘట్టం

కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర, పాలకొండ జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణలను శనివారం నాయకులు, కార్యకర్తలు, అధికారులు పెద్ద ఎత్తున కలిసి అభినందనలు తెలిపారు. అధికారులు వారి సమస్యలను ఎమ్మెల్యేలకు వివరించగా వారు సానుకూలంగా స్పందించారు.



కురుపాం:ఎమ్మెల్యే జగదీశ్వరిని సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు



పార్వతీపురం టౌన్: ఎమ్మెల్యే విజయ్‌చంద్రను సత్కరిస్తున్న ఎంఇఒ, తదితరులు



వీరఘట్టం: ఎమ్మెల్యే జయకృష్ణను సత్కరిస్తున్న ఆర్‌టిసి ఉద్యోగులు

ఏజెన్సీలో దోమల నివారణకు స్ప్రేయింగ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మారుమూల గిరిజన గ్రామాల్లో జ్వరాలు ప్రబలకుండా దోమల నివారణ చర్యలు ముమ్మరంగా చేపడుతున్నామని జిల్లా మలేరియా అధికారి(డిఎంఒ) డాక్టర్ టి. జగన్ మోహన్ రావు అన్నారు. దేరువాడలో నిర్వహించిన దోమల నివారణ మందు పిచికారీ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. కుస, నొంద్రుకోన, వండిడి, డి.కెక్కువ గ్రామాల్లో స్ప్రేయింగ్ నిర్వహించామన్నారు. ఇంటింటికీ దోమల నివారణ మందు ఎసిఎం ద్రావణాన్ని స్ప్రేయింగ్ చేస్తున్న తీరును ఆయన స్వయంగా పరిశీలించారు. మొత్తం ఇళ్ళు, వినియోగిస్తున్న కెమికల్ మోతాదు తదితర వివరాలు తెలుసుకొని ప్రజలు సహకరించి వినియోగించుకోవాలని కోరారు. ప్రస్తుతం మొదటి విడత స్ప్రేయింగ్ జరుగుతుందని వచ్చే నెలలో రెండో విడత ఉంటుందని, సీజనల్ జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. వీటితో పాటుగా ప్రతీ రోజూ డ్రైడే నిర్వహణ, ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, ఫీవర్ సర్వే, ఫాగింగ్ మొదలగు దోమల వ్యాప్తి నివారణ చర్యలను సంబంధిత శాఖల సమన్వయంతో పక్కాగా చేపట్టి మలేరియా, డెంగీ, సీజనల్ జ్వరాలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అక్కడ గర్భిణి గృహ సందర్శన చేసి ఆరోగ్య పరిశీలన చేశారు. ఈ నెల మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా



స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న డిఎంఒ డాక్టర్ జగన్‌మోహనరావు

గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించి సీజనల్ జ్వరాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. అనంతరం దుడ్డుఖల్లు పిహెచ్‌సిని సందర్శించి ల్యాబ్ తనిఖీ చేశారు. ప్రతి రోజూ నమోదు అవుతున్న జ్వరాలు, నిర్ధారణ పరీక్షల వివరాలు రికార్డులో పరిశీలించారు. మలేరియా గా గుర్తించిన వివరాలు కార్యాలయానికి వెంటనే తెలియజేయాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ బి. స్వాతి, సబ్ యూనిట్ అధికారి ఎస్.నారాయణరావు, సూపర్‌వైజర్లు జయగౌడ్, పెంటమ్మ, వైద్య సిబ్బంది గీత, ప్రశాంత్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేతో యుటిఎఫ్ నాయకులు

జిఒ 117ను రద్దు చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిఒ 117ను రద్దు చేయాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మురళీమోహనరావు కోరారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి తమ సమస్యలను వివరించారు. విలీనమైన పాఠశాలల పోస్టింగ్ తగ్గించడం వంటి సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యలను విన్న ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తారానికి కృషి చేస్తానన్నారు. ఇక ఉద్యోగులకు ఎటువంటి కష్టాలూ రావన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు టి.రమేష్, జిల్లా కమిటీ సభ్యులు ఉన్నారు.

పాలకొండలో అన్న క్యాంటీన్ ఎక్కడ?

ప్రజాశక్తి-పాలకొండ

రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ముఖ్యమంత్రిగా తన నాల్గవ సంతకాన్ని అన్న క్యాంటీన్ పునరుద్ధరణపై పెట్టారు. ఈ పరిస్థితిలో పాలకొండలో అన్నా క్యాంటీన్ ఎక్కడ ఏర్పాటు చేయనున్నారో తెలియాల్సి ఉంది. గతంలో 2019లో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు పాలకొండలో అన్నా క్యాంటీన్ కోసం స్థానిక దుర్గమ్మ ఆలయ పరిసరాలకు ఆనుకుని ప్రధాన రహదారిపై స్థలాన్ని గుర్తించి పక్కా భవనాన్ని నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వం మారిన తరువాత వైసిపి ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను పక్కన పెట్టడంతో ఆ బిల్డింగ్‌ను గ్రామ సచివాలయంగా మార్పు చేసి ఉపయోగంలోకి తీసుకుని వచ్చారు. ఇప్పటికీ కూడా ప్రజలు ఆ సచివాలయాన్ని అన్నా క్యాంటీన్ సచివాలయం అనే పిలుచుకుం టున్నారు. మళ్లీ



గతంలో అన్న క్యాంటీన్ నడిపిన భవనం

టిడిపి అధికారంలోకి వచ్చిన దరిమిలా అన్నా క్యాంటీన్లను ప్రారంభించడానికి సిద్ధమవుతున్న ఈ తరుణంలో ఆ సచివాలయాన్ని వేరే దగ్గరకు తరలించి అక్కడే అన్నా క్యాంటీన్ ప్రారంభిస్తారని కొంతమంది చర్చించుకుంటున్నారు. లేదా కాంప్లెక్స్ పరిసరాల్లో లేకుంటే హాస్పిటల్ దగ్గర్లో అయినా అన్నా క్యాంటీన్‌ను ప్రారంభిస్తారని కొంతమంది వాదన. ఏదీ ఏమైనా ఐదు రూపాయలకే పేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్‌ను ఎక్కడ ఏర్పాటు చేస్తారో కొన్ని రోజుల్లో తేలిపోనుంది.

జంఝావతిని నిర్మించాలి

ప్రజాశక్తి - కొమరాడ

దశాబ్ద కాలంలో నిలిచిపోయిన జంఝావతి జలాశయాన్ని పూర్తిస్థాయిలో నిర్మించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని కోటిపాంలో రైతులతో కలిసి జంఝావతి ప్రాజెక్ట్ సమస్యపై శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేగా తోయక జగదీశ్వరి బాధ్యతలు చేపట్టిన రెండో రోజే జఝావతి రిజర్వాయర్ పూర్తికి కృషి చేస్తాననడం శుభ పరిణామమని, ఇదే స్ఫూర్తితో రిజర్వాయర్ పూర్తి చేసేలా ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కృషి చేయాలని కోరారు. సుమారు 24 వేల ఎకరాలఎ సాగునీరందించే ఈ ప్రాజెక్టు ప్రారంభించి 48 ఏళ్ల కావస్తున్నా నేటికీ పూర్తికాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కీర్తిశేషులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఈ రిజర్వాయర్ పై రబ్బర్ డాం నిర్మించి లోలెవెల్ కెనాల్ ద్వారా 12వేలు, హై లెవెల్ కెనాల్ ద్వారా 12వేల ఎకరాలకు సాగునీరందించేందుకు చర్యలు చేపట్టారన్నారు. అయితే ఇరిగేషన్ అధికారులు, అనంతరం పాలకుల నిర్లక్ష్యం వల్ల కేవలం 4వేల ఎకరాలకే సాగునీరందుతుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుత ప్రభుత్వమైనా రిజర్వాయర్ పూర్తికి కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఉపేంద్ర, రైతులు పకీరు, మాధవ, రామకష్ణ, వసంతరావు పాల్గొన్నారు.

గడగమ్మలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని గడగమ్మ గ్రామంలో శనివారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ప్రదీప్ వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, పాల్గొన్నారు.

ఘనంగా వైసిపి నాయకుడి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- సాలూరు

వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు జన్మదిన వేడుకలు శనివారం ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఆయన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. బర్త్‌డే కేక్ కట్ చేసి నాయకులు కార్యకర్తలకు పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జర్జాపు దీప్తి, ఆమె భర్త దిలీప్ శుభాకాంక్షలు తెలిపారు. రామా థియేటర్‌లో కూడా జెసిఎస్ కన్వీనర్ గిరి రఘు ఆధ్వర్యాన కౌన్సిలర్‌లు బర్త్ డే కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు పప్పల లక్ష్మణరావు, గొర్లి వెంకటరమణ, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ, వైసిపి నాయకులు హరి బాలాజీ, మండవిల్లి బద్రి, లింగాల సింహాచలం, రౌతు సురేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినబోగిలి, తామరకండి గ్రామాలలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఇఒపిఆర్‌డి కె.సత్యం శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధులు భారిన పడకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఇఒపిఆర్‌డి



బలిజిపేట: శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంజీవనాయుడు, తదితరులు

పెదపెంకిలో శ్రీశ్రీ వర్ధంతి వేడుకలు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో శనివారం శ్రీరంగం శ్రీనివాసరావు వర్ధంతి వేడుకలు నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ నాయుడు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీ ఎంతో సమయస్ఫూర్తి గల వ్యక్తి అని, సందర్భానుసారంగా సంయోచితమైన ఆలోచన చేస్తూ మహాకవి గాను ఎదిగారని కొనియాడారు. అభ్యుదయ భావాలు గల వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో నారాయణ, సత్యనారాయణ, హర్ష తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని వెంకట భైరపురం గ్రామానికి చెందిన మారడ ఈశ్వరరావు (37) ఆత్మహత్యకు పాల్పడి శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ నరసింహమూర్తి తెలిపిన వివరాలు ప్రకారం.. ఈశ్వరరావు తన భార్య కృష్ణవేణితో తరచూ మద్యం కోసం డబ్బులడుగుతూ డబ్బులు ఇవ్వని ఎడల చనిపోతానని బెదిరిస్తూ ఉండేవాడు. ఈనెల 8వ తేదీన ఎప్పటిలాగే బెదిరింపులు చేపడుతూ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అదే రోజు సాయంత్రం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకుండా పోయింది. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజన గ్రామాల్లో మలేరియా మహమ్మారి

- సిహెచ్‌ఎన్‌సిలో రోజురోజుకు పెరుగుతున్న రోగుల సంఖ్య
- వైద్యసేవలందిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని గత రెండు రోజులుగా గిరిజన గ్రామాల నుంచి జ్వర పీడితులు చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేరుతున్నారు. ముఖ్యంగా ఎండలు ఎక్కువగా ఉండడం గత రెండు రోజులుగా వర్షాలు కూడా కురవడంతో జ్వర పీడితులు సంఖ్య రోజురోజుకు పెరుగుతుందనే చెప్పాలి. అర్నాడ పంచాయతీ కొత్తవలస గ్రామానికి చెందిన మండంగి నన్విత్, బిడ్డిక పూజశ్రీ తీవ్రమైన జ్వరంతో ఆసుపత్రిలో చేరగా వనిజ గ్రామానికి చెందిన జోగి దొర, కొండగొర్రె సంసేను, ఆరిక హైమావతి, పి. సుమలత కె.సౌజన్య తదితరులు మలేరియా జ్వరంతో చికిత్స పొందుతున్నారు. టీకే జమ్ము పంచాయతీ పాంద్రసింగి గ్రామానికి చెందిన మరో 13 మంది జ్వర పీడితులు ఇక్కడే చికిత్స పొందుతున్నారు. అర్నాడ, పిటిమండ, అలమండ, కొండచిలకాం, గొర్లి చింతమానుగూడ, చినతోలుమండ గ్రామాల్లో కూడా జ్వర పీడితులు ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు ఇప్పటికే జియ్యమ్మవలస, రావాడ రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్సను అందిస్తున్నప్పటికీ చాలావరకు బాధితులు చిన మేరంగి సిహెచ్‌సికి వస్తున్నారు. వీరందరికీ వైద్యాధికారి సునీల్ కుమార్ తన సిబ్బంది మెరుగైన చికిత్సను అందిస్తున్నామని తెలి పారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు కూడా అప్రమత్తం కావాలని గ్రామాల్లో పారిశుధ్య పనులపై మండల అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరారు.



చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులు



గోదామును పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

జిసిసి గోదాముల పరిశీలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ గోదాములను వైజాగ్ జిసిసి ముఖ్య కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన విజిలెన్స్ అధికారిని ఎంవివిఎస్ ఉమాదేవి శనివారం పరిశీలించారు. ఈమె ముందుగా ఎల్విన్ పేటలో ఉన్న గ్యాస్ గోదాం, బియ్యం గోదాములను ఇతర నిత్యవసర సరుకులు ఉంచే గోదాములను పరిశీలించారు. అనంతరం ఆమె జిసిసి సేల్స్ డిపోలను కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ బ్యాలెన్స్ రికార్డులను పరిశీలించారు. ఈమె వెంట గుమ్మలక్ష్మీపురం జిసిసి మేనేజర్ కృష్ణ ప్రసాద్, గోదాం ఇంచార్జ్ సాంబశివరావు, తదితర సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర

టిడిపితోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

చంద్రబాబు పాలనలో రానున్న రోజుల్లో రాష్ట్రంలోని విద్యార్థులందరికీ బంగారు భవిష్యత్తు ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మండలంలోని బందులుప్పి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్వాకం వల్ల రాష్ట్రం 25 ఏళ్ల వెనక్కు వెళ్లిందని, రాష్ట్ర విభజనతో జరిగిన నష్టం కన్నా ఎక్కువ నష్టం గత పాలనలో జరిగిందని విమర్శించారు. ఇటువంటి పరిస్థితుల్లో చంద్రబాబు ఒక్కరే రాష్ట్రాన్ని చక్కదిద్దగలరన్న నమ్మకంతో ప్రజలు ఆయనకు పరిపాలన అప్పజెప్పారన్నారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫారాలు అందించారు. కార్యక్రమంలో డిఇఒ జి.పగడామ్మ, ఎంఇఒ-1 సామల సింహాచలం, మండల టిడిపి అధ్యక్షులు బోను దేవి చంద్రమౌళి, గురజాన చంద్రమౌళి, గొట్టాపు వెంకట నాయుడు, శంకరాపు కష్ణ, బార్నాల సీతారాం, హెచ్ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని నర్సిపురంలో అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ పిఒ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ కేంద్రాల్లో చదివి ఒకటో తరగతికి అర్హత పొందిన పిల్లలకు ధ్రువ పత్రాలను అందజేశారు. మండల ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశాలు జరిపారు. కార్యక్రమంలో నర్సిపురం సెక్టార్ పర్యవేక్షకులు భాను, సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని రావివలస, పెదగుడబ సెక్టార్ల పరిధిలోని అంగన్వాడి కేంద్రాల్లో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు రౌతు లక్ష్మి, అరుణ కుమారిల ఆధ్వర్యంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రావివలస, సంతోషపురం, పెదగుడబ తదితర గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి గత సంవత్సరంలో అంగన్వాడీ కేంద్రాలకు వచ్చిన పిల్లలు ఏమి నేర్చుకున్నారు, వారి ఎదుగుదలకు ఎలా సహాయపడింది తదితర అంశాలను సూపర్‌వైజర్లు లక్ష్మి, అరుణకుమారిలు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చదువుకున్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు స్వేచ్ఛ పూరితమైన విద్యను అందించామన్నారు. ఈ కార్యక్రమం అనంతరం ఒకటో తరగతిలో చేరేందుకు అర్హత పొందిన పిల్లలకు ధృవపత్రాలను సూపర్‌వైజర్లు అందజేశారు.



గరుగుబిల్లి: విద్యార్థిని సత్కరిస్తున్న సూపర్‌వైజర్



పిల్లలను సత్కరిస్తున్న ఐసిడిఎస్ పిఒ శ్రీనివాసరావు

ఉపాధి చట్టాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

ఉపాధి హామీ చట్టం ప్రకారం వేతనదారులకు కూలి, ఇతర సౌకర్యాలు పక్కాగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగు నాయుడు అన్నారు. శనివారం కురుపాం సమీపంలో గల సంగెడ్డలో జరుగుతున్నట్టు ఉపాధి పనుల వద్దకు వెళ్లి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులతో ఆయన మాట్లాడుతూ రోజువారీ కూలీ కనీసం రూ.600 ఇవ్వాలని, పని ప్రదేశంలో చలువ పందిర్లు, మజ్జిగ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయం యాంత్రీకరణ పెరిగినందున ట్రాక్టర్లు, మిషన్లు, కలుపు మందులు వాడడంతో వ్యవసాయ పనులు తగ్గిపోతున్నాయన్నారు. రెండు పూటలా పని వల్ల కూలీలు వ్యవసాయ, ఇతర ఇంటి పనులు చేయలేక పోతున్నారన్నారు. పని వద్దకు కిలోమీటర్లు దూరం నడవలేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఉపాధి చట్టంలో పొందుపర్చిన విధంగా కూలీలకు అన్ని సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారుస్తూ ఎత్తివేయడానికి చూస్తుందని, వ్యవసాయ కూలీలంతా పోరాడి ఉపాధి హామీ చట్టాన్ని నిలబెట్టు కోవాలంటే సంఘంలో చేరి హక్కుల సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు.



కూలీలతో మాట్లాడుతున్న కొల్లి గంగునాయుడు

వృద్ధుల బాగోగులను పిల్లలే చూసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వయోవృద్ధులను నిర్లక్ష్యం చేయరాదని, వారి బాగోగులను పిల్లలే చూసుకోవాలని ప్రముఖ సీనియర్ న్యాయవాది టి. జోగారావు అన్నారు. పట్టణంలోని బెలగాంలో శనివారం ఐఆర్‌పిడబ్ల్యుఎ, రెడ్ క్రాస్ సొసైటీ, హెల్ప్ ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రపంచ వయోవృద్ధుల దుర్వినియోగ అవగాహన దినోత్సవం స్థానిక ఫించన్‌దారుల సమావేశ మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ న్యాయవాది జోగారావు మాట్లాడుతూ వయోవృద్ధులను అశ్రద్ధ చేయరాదని, వారి బాగోగులను పిల్లలే చూసుకోవాలని తెలిపారు. అంతేకాక తల్లిదండ్రులు కూడా పిల్లలతో మంచి సంబంధాలు ఏర్పర్చుకొని ముందు కొనసాగాలని సూచించారు. వయోవృద్ధులకు ఎటువంటి సమస్యలు వచ్చినా ఉచితంగా సలహాలు ఇవ్వడం, ఆస్తులు, ఎటువంటి గొడవలు ఉన్నా స్థానిక ఆర్‌డిఒ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ బెలగాం జయ ప్రకాష్ నారాయణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే తల్లిదండ్రుల పట్ల ప్రేమానురాగాలతో ఉండాలని, పిల్లలకు ఇటువంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ప్రముఖ కవి గంటేడ గౌరినాయుడు మాట్లాడుతూ చట్టాల కంటే ప్రేమానురాగాలతో చాలా సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ మంచుపల్లి శ్రీరాములు మాట్లాడుతూ వృద్ధాప్యంలో వచ్చే సమస్యలు వృద్ధులు అవగాహన కలిగి మెలగాలని సూచించారు. కార్యక్రమంలో నిరాశ్రయులకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం పలువురు వయోవృద్ధులను సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ప్రకాష్, అప్పల రాజు, పెన్షన్ భవన్ సభ్యులు, సీతం ఇంజనీరింగ్ కాలేజ్ స్టూడెంట్స్, సిబ్బంది గణేష్ జానీ, పెన్షనర్స్ సభ్యులు ఊర్మిళ మరియు మనోహర తదితరులు పాల్గొన్నారు.



వయో వృద్ధురాలను సత్కరిస్తున్న నిర్వాహకులు